పర్యావరణ కళాకారులు

- మట్టి ప్రతిమలకు కొలువు గాడిలంక
- నూరేళ్ల కళకు జీవం పోస్తున్న వైనం
- పీఓపీ విగ్రహాలకు దీటుగా తయారీ



రూపు దిద్దుకుంటున్న ప్రతిమలు



కళాత్మకంగా రూపుదిద్దుకున్న విగ్రహాలు

ముమ్మిడివరం: మనుషులు కొలిచే దేవుళ్ల ప్రతిమలను మట్టి ముద్దలతో మనోహరంగా అలవోకగా తయారు చేసే అపర బ్రహ్మలు వారు. నూరేళ్లగా పెద్దల నుంచి నేర్చుకున్న ఈ కళనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నారు. ముమ్మిడివరం మండలం గాడిలంక గ్రామం శిల్పకళకు పెట్టింది పేరు. ఏడాది పొడవునా విగ్రహాలు తయారు చేస్తుంటారు. ఏ లోగిలి చూసిన విగ్రహాలే కొలువు తీరి ఉంటాయి. సాంప్రదాయంగా మట్టి, కాగితపు గుజ్జు, నావసుద్ద ఉపయెగించిన మిశ్రమంతో విగ్రహాలు రూపొందించి పర్యావరణ పరిరక్షణకు ఆజ్యంపోస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఫైబర్, పింగాని వంటి బొమ్మలు మార్కెట్‌లోకి రావడంతో ఈ విగ్రహాలకు డిమాండ్ తగ్గి వారి జీవనానికి శాపమైంది.

పస్తులుండాల్సిన పరిస్థితి

మట్టితో తయారు చేసే ప్రతిమలకు ఇటీవల ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే ప్రతిమలు పోటిపడుతున్నాయి. పర్యావర ణానికి విఘాతం కల్గించే వీటి పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. సంప్రదాయంగా వస్తున్న వృత్తిని వదులుకొలేక ఇతర వృత్తులు చేపట్టలేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇటివల పర్యావరణ పరిరక్షణ కొరకు వినాయక చవితికి మట్టి విగ్రహాలనే వినియోగించాలని పర్యావరణ వేత్తలు ముందుకు రావడంతో వీరి కళకు జీవం పోసి నట్లయింది.

ప్రత్యేక ఖ్యాతి..

తొలుత విగ్రహల ఆకృతులను రూపొందించి మూసలు (అచ్చులు) తయారు చేస్తారు. మట్టితో కూడిన మిశ్రమంతో అవసరమైన మేరకు విగ్రహాలను సిద్ధం చేస్తారు. చవితికి నాలుగు నెలలు ముందు నుంచి చేతినిండా పని దొరుకుతుంది. మిగిలిన రోజుల్లో దీపావళి ,దసరా, శ్రీరామనవవి, సంక్రాతి పర్వదినాలలో వివిధ దేవతామూర్తుల విగ్రహాలు, అందమైన డిబ్బిలు, షోకేసు బోమ్మలు తయారు చేసి జీవనోపాధి పొందుతారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పోటీ..

మట్టితో తయారు చేసే ప్రతిమలకు ఇటీవల ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే ప్రతిమలు పోటిపడుతున్నాయి. పర్యావర ణానికి విఘాతం కల్గించే వీటి పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిష్‌తో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని పర్యావరణాన్ని పరిరక్షించాలని, పర్యావరణ శాఖ, ప్రభుత్వం, ప్రజా సంఘాలు ఎంత మొత్తుకున్నా మార్కెట్‌లో వీటి వినియోగం తగ్గడంలేదు. దీంతో మట్టి విగ్రహలకు గిరాకీ తగ్గి గిట్టుబాటు ధర లభించడం లేదని కళాకారులు వాపోతున్నారు.

పెరిగిన ధరలు

విగ్రహల తయారికి ఉపయెగించే మట్టి, కాగితపు గుజ్జు, నామసుద్ద ధరలు విపరీతంగా పెరిగాయి. పంట పొలాలనుంచి సేకరించిన మట్టిని నానబెట్టి అందులో కాగితపు గుజ్జు, నామసుద్దను వేసి మిశ్రమంగా తాయారు చేస్తారు. నాన బెట్టిన మట్టిలో వీటిని కలిపేందుకు కాళ్లతో కలియతొక్కి మిశ్రమాన్ని మృధువుగా తయారు చేయటానికి శ్రమపడవలసి వస్తుంది. ఒక బస్తా నామసుద్దను మిశ్రమాన్ని తయారు చేయాటానికి నాలుగు గంటలు సమయం పడుతుంది.

నూరేళ్ల క్రితం శ్రీకారం

వందేళ్ల క్రితం పెద్దిరెడ్డి వెంకన్న అనే కళాకారుడు విగ్రహాల తయారీకి అంకురార్పణ చేశారు. ఆయన కుమారుడు అచ్యుతరామయ్య అనేక మంది కళాకారులకు తర్ఫీదునిచ్చారు. ఇక్కడ తర్ఫీదు పొందిన అనేక మంది కళాకారులు అమలాపురం, కొత్తపేట, రాజమండ్రి, కాకినాడ, విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌లలో ఈ కళనే వృత్తిగా చేసుకుని జీవనోపాధి సాగిస్తున్నారు.

ప్రోత్సాహం కరవు

గతంలో ఈ గ్రామాన్ని సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు విగ్రహాలు భద్రపరుచుకొనేందుకు గిడ్డంగులు, ముడిసరుకులు సమకూర్చుకొనేందుకు సబ్సిడీలతో కూడిన రుణాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హమీలు నేటికి ఆచరణకు నోచుకోలేదని కళాకారులు అంటున్నారు. విగ్రహాల తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి ఆర్థిక ప్రోత్సాహం కల్పించాలని కోరుతున్నారు.

గిట్టుబాటు ధర లేదు



ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయి గిట్టుబాటు కావడంలేదు. ఒక విగ్రహం తయారికి మూడు నుంచి ఐదు రొజులు పడుతుంది. అమ్మితే రోజువారి వేతనం కూడా రాని పరిస్థితి. వేరే పనిచేయలేక ఇదే వృత్తిలో నెట్టుకొస్తున్నాం.

కొమ్మిరెడ్డి సూర్యచంద్రరావు, కళాకారుడు, గాడిలంక

ప్రభుత్వం ప్రోత్సహించాలి



తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలో కూడా పర్యావరణ శాఖ నేరుగా తమ నుంచి విగ్రహాలు కొనుగోలు చేసి భక్తులకు ఉచితంగా పంపిణీ చేయాలి. దీంతో పర్యావరణ పరిరక్షణకు ఆజ్యంపోసినవారు అవుతారు. పరోక్షంగా మాకు ఆర్థికంగా ప్రొత్సహం అందుతుంది.

పి.బాలు, కళాకారుడు, గాడిలంక

క్లుప్తంగా

కన్నబాబుకు మాజీ ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ



సత్యన్నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పొన్నాడ, తదితరులు

తాళ్లరేవు: పితృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు కుటుంబ సభ్యులను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు పరామర్శించారు. ఆదివారం కాకినాడలోని కన్నబాబు స్వగృహంలో ఆయన తండ్రి కురసాల సత్యన్నారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో తాళ్లరేవు మండల పార్టీ అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, బూరెల వెంకట్రాజు, నేల శ్రీను, దొరబాబు, పిన్నమరాజు శ్రీనురాజు, చందు తదితరులు ఉన్నారు.

'కూరాటి'కి..



నరసింహమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొన్నాడ

తాళ్లరేవు: ఆర్‌ఎంపీ వైద్యుడు కూరాటి నరసింహమూర్తి, గోవలంక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు ఆదివారం బాధిత కుటుంబాన్ని స్వగృహానికి వెళ్లి ఆయన కుమారుడు వాసు, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నరసింహమూర్తి మృతి పార్టీకి తీరనిలోటని, నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి, నాయకులు కోరుకొండ చంటి, పెయ్యల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

లంక భూములను దోచుకుంటున్న ఓఎన్జీసీ

యానాం: సముద్రంలోని ఐలాండ్ నెంబరు-3 నుంచి ఎస్సీఫీల్డ్ లేబర్ సొసైటీ వ్యవసాయ భూముల మీదుగా ఓఎన్‌జీసీ గ్యాస్‌పైప్‌లైన్ వేస్తుండటాన్ని గతంలో తాను వ్యతిరేకించానని దళితసాహిత్య అకాడమీ దక్షిణభారత అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయక ఫీల్డ్‌లేబర్ సొసైటీ సభ్యులను లోబర్చుకుని 2023లో ఆ సంస్థ పైపులైను నిర్మాణం చేసిందని ప్రస్తుతం అది ప్రమాదకరంగా మారిందన్నారు. ఎస్సీలకు వ్యవసాయభూముల ఇప్పించేందుకు 1975లో పుదుచ్చేరి ప్రభుత్వంతో తన ఆధ్వర్యంలో జరిగిన పోరాటం ఫలితంగా 191 మంది రైతులకు లంక భూములు ఇప్పించగలిగానన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఒక నేత భూములను కారుచౌకగా ఇప్పిస్తూ కంపెనీల వద్ద తన పరపతి పెంచుకుని ఏడాదికి రూ.41కోట్లు దండుకుంటున్నా కూడా ఎస్సీ సోదరులు కళ్లు తెరవకుండా ఉండటంపై మండిపడ్డారు. తాజాగా మూడో గ్యాస్ పైప్‌లైన్ వేస్తున్న నేపథ్యంలో మొత్తం ఎస్సీ భూములను కంపెనీ తీసుకునే ప్రయత్నాలను ఐక్యంగా కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

భావితరాలకు స్ఫూర్తి వంగవీటి రంగా



పి.మల్లవరంలో మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధాకృష్ణ

తాళ్లరేవు: పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన వంగవీటి మోహనరంగా భావితరాల రాజకీయ నాయకులకు స్ఫూర్తిప్రదాత అని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి పి.మల్లవరం గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత నేత స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని రాధాకృష్ణ పాల్గొని ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం మూడున్నర ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా రాజకీయాల్లో ఉన్న వ్యక్తిని 36 ఏళ్ల తర్వాత కూడా ఈ స్థాయిలో స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు. యువత రంగాను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కాపు సంఘం నాయకులు ఆకుల రామకృష్ణ, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, కాటంశెట్టి రామ్మూర్తి, కోలా బాబ్జి, వేగిరాతు రాజబాబు, బూరగడ్డ శ్రీనివాసరావు, కల్వకొలను తాతాజీ, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రహోదా సాధనలో విఫలం

యానాం: పుదుచ్చేరికి రాష్ట్ర హోదా సాధనలో ఎన్ఆర్ కాంగ్రెస్, ఎన్డీయే ప్రభుత్వాలు విఫలం అయ్యాయిని మాజీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2026 ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర హోదా కోసం పట్టుబడతామన్నారు. సీఎం రంగస్వామి స్టేట్‌హుడ్ కోసం డిమాండ్ చేస్తే దానిని మంజూరు చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగం తెలిపారన్నారు. రాష్ట్రహోదాకై అసెంబ్లీలో 10 సార్లుకు పైగా తీర్మానాలు ఆమోదించినా ఫలితం లేదని ఈ నేపథ్యంలో అసెంబ్లీకి గౌరవం ఏముందని ప్రశ్నించారు.

100 మంది రక్తదానం



అమలాపురం ఓం శాంతి కేంద్రంలో రక్తదానం చేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా అమలాపురం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఓంశాంతి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక రవణం వీధిలోని ఓంశాంతి హార్మోని హౌస్‌లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో వంద మంది రక్తదానం చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఓంశాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి మాట్లాడుతూ ఓం శాంతి రాజయోగిని దాదీ ప్రకాష్ మణి పవిత్ర స్మరణార్థం విశ్వబంధు దివస్‌ను పురస్కరించుకుని జాతీయ స్థాయిలో అన్ని బ్రహ్మ కుమారీస్ కేంద్రాల్లో లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించాలన్న లక్ష్యంలో భాగంగా అమలాపురంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఓం శాంతి కేంద్రం ద్వారా అందుతున్న సమాజ సేవలను కొనియాడారు. రక్తం దాన చేసిన 100 మంది దాతలకు బ్రహ్మకుమారి శ్రీదేవి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు నల్లా చిట్టిబాబు, నల్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల ట్రోఫీలు, మెడల్స్ ఆవిష్కరణ



ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల ట్రోఫీలు, మెడల్స్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో ఈనెల 29న జరగనున్న 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల చాంపియన్ ట్రోఫీలు, ఒలింపిక్ మెడల్స్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, కార్య నిర్వాహక కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. సబ్ జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో పోటీలు పురుషులు, మహిళలకు జరుగుతాయన్నారు. మొత్తం 30 కేటగిరీల్లో విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, ఒలింపిక్ మెడల్స్, చాంపియన్ షిప్ ట్రోఫీలు, నగదు బహుమతులను ప్రదానం చేస్తామని వివరించారు. తన తండ్రి అడపా భోగిరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, అమలాపురం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకట సుబ్రహ్మణ్యం ట్రోఫీలు, నగదు బహుమతులు సమకూర్చుతున్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు కల్వకొలను బాబు, పవర్ లిఫ్టింగ్ పోటీల ఆర్గనైజర్, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, సాకుర్రు గున్నేపల్లి సర్పంచ్ పెద్దిరెడ్డి రాము, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలే సన్మార్గాలు



ఆధ్యాత్మిక ప్రవచనాలు చెబుతున్న ఏలూరు జిల్లా సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

అమలాపురం రూరల్: మానవతా విలువలే మానవుడిని సన్మార్గంలో నడిపిస్తాయని ఆధ్యాత్మికవేత్త, ఏలూరు జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ జంధ్యాల నాగేశ్వరరావు అన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శత వర్ష జన్మదినోత్సవాల్లో భాగంగా అమలాపురం రూరల్ మండలం బండార్లంక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామంలోని సత్యసాయి నిలయంలో ఆదివారం జరిగిన ఆధ్మాత్మిక కార్యక్రమంలో నాగేశ్వరరావు ప్రవచనాలు చెప్పారు. అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ ఆధ్యాత్మిక సభలో నాగేశ్వరరావు ప్రవచనాలు చెబుతూ మనిషి నీతిగా బతికినంత కాలం ఏ శక్తి ఆ మనిషిని ఏమీ చేయలేవని చెప్పారు. ఆ మనిషి నిజాయితీయే అతనికి ఓ కవచంలా పనిచేస్తుందన్నారు. సనాతన భాగవత భక్త సమాజం సభ్యుల రచించిన పలు రచనలు, సంకలనాల గురించి ఆయన వివరించారు. రామయాణ సుధాలహరి, వినాయక సుధాలహరి, శివసాయి సుధాలహరి, ఓం జగదీశ హరే, నిత్య ప్రార్థనలకు సంబంధించి సభలో సత్యసాయి భక్తులకు ఆధ్మాత్మికవేత్త నాగేశ్వరరావు విశదీకరించారు. శ్రీసత్యసాయి బాల వికాస్ జిల్లా కన్వీనర్ శిష్టా గుణరంజన్ ప్రసంగించారు.

రొయ్యల చెరువులకు దేవాలయ భూములు..!

- అనుమతులు తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం
- దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం వరి పంటసాగు భూములను రొయ్యల చెరువులుగా మార్చడంపై మురమళ్లకు చెందిన మాజీ సర్పంచ్ చెయ్యేటి శ్రీనుబాబు రాజమహేంద్రవరం దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకర్లకు వివరాలను వెల్లడించారు. వీరేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 87లో 3.91 సెంట్లలో పంట భూమి ఉంది. ఈ భూమి దేవస్థానం అర్చకులు యనమండ్ర వీరేశ్వర శర్మ పేరున పంటభూమిగా సాగుచేసేందుకు హక్కు కలిగి ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కలెక్టర్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్, ఎండోమెంట్, ఇలా ఎవ్వరీ అనుమతులు తీసుకోకుండా వరి పండించే పంట భూములను రొయ్యలు చెరువులుగా మార్పులు చేశారు. లక్షలాది రూపాయలు లీజులు, సబ్ లీజులకు ఇచ్చి అక్రమ విద్యుత్ వినియోగిస్తూ దేవస్థానం ఆదాయానికి గండి కొడుతూ పలు అక్రమాలకు పాల్పడుతూన్నారు.


ఆలయాధికారుల మౌనం

ఈ విషయాన్ని సదరు మురమళ్ల దేవస్థానం ఈఓ, సూపరింటెండెంట్ గానీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు. వెంటనే సమగ్ర దర్యాప్తు జరిపి పంట భూములను ఆక్వా భూములుగా మార్పులు చేసిన సంబంధిత వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకొని అక్రమ విద్యుత్ కనక్షన్లను తొలగించి, నిర్లక్ష్యంగా వహించిన దేవస్థానం ఈవో, సూపరింటెండెంట్ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

కోడిపందేలపై పోలీసుల మెరుపు దాడి

అల్లవరం: కొమరగిరిపట్నం ఎడ్లరేవు నుంచి సముద్రతీరానికి వెళ్లే దారిలో రొయ్యల చెరువులను ఆనుకుని ఆదివారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్న శిబిరంపై అల్లవరం పోలీసులు మెరుపు దాడి చేశారు. పోలీసులు దాడిలో ఆరు మోటార్ సైకిల్, ఒకరిని అదుపులో తీసుకున్నారు. పేకాట శిబిరం నుంచి పలువురు నిర్వాహకులు పరారైనట్లు సమాచారం.

విద్యార్థులు పట్టుబడితే తల్లిదండ్రులు కౌన్సెలింగ్‌కు రావాలి



ఆర్టీవో కార్యాలయంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీటీవో శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: రహదారి భద్రత దృష్ట్యా రవాణాశాఖ తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా మోటార్ బైక్ నడుపుతున్న విద్యార్థులు పట్టుబడితే తల్లిదండ్రులు ఆర్టీవో కార్యాలయానికి కౌన్సెలింగ్‌కి హాజరుకావాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. రహదారి భద్రతపై ఎన్ని అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్న మార్పు కనిపించడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని డీటీఓ ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ యాజమాన్యాలు 18 ఏళ్లు నిండిన విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని, అదే విధంగా హెల్మెట్ ధరించకుండా బైక్‌పై కాలేజీలకు వచ్చే విద్యార్థులకు కాలేజీ ఆవరణలో పార్కింగ్‌కి అనుమతి ఇవ్వవద్దని డీటీఓ సూచించారు. రహదారి భద్రత విషయంలో పిల్లల పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనని డీటీఓ పేర్కొన్నారు. రహదారి భద్రత ఉల్లంఘన ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని డీటీవో హెచ్చరించారు.

గ్యాస్ లీకేజీలను అరికట్టాలి



మత్స్యకారుల సమావేశంలో పాల్గొన్న మల్లాడి, ఎమ్మెల్యే దాట్ల

యానాం: గోదావరిలో ఐలాండ్-3 ఎస్సీ ఫీల్డ్‌లేబర్ సొసైటీ భూములకు సమీపంలో ఈనెల 22న ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీకేజ్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బోట్లు ద్వారా వెళ్లి అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరిస్తానన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా ఓఎన్‌జీసీ సంస్థ చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే ప్రజలు ఆందోళన బాటపడతారని హెచ్చరించారు.

శాంతియుత పోరాటంతో పరిహారం..

మత్స్యకారుల సమావేశంలో పాల్గొన్న ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ ఓఎన్‌జీసీ గ్యాస్ లీకేజీతో నష్టపోయిన మత్స్యకారులకు శాంతియుత పోరాటం ద్వారానే పరిహారం సాధించగలుగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యానాం పరిసర ప్రాంతాల మత్స్యకారులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ నిలుపుదల

- ఆపరేషన్‌లు చేయని కార్పొరేట్ ఆసుపత్రులు
- దిక్కుతోచని స్థితిలో యానాం రోగులు

యానాం: కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుంచి పలువురు రోగులు వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం వెళ్తుంటే ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను అమల చేయడం లేదని ఆదివారం పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. యానాంకు చెందిన కుంచే సత్యవతి కుడి భుజంకు ఆపరేషన్ నిమిత్తం కాకినాడ సంజీవని ఆసుపత్రికి స్థానిక జీజీహెచ్ నుంచి ఆయుష్మాన్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ రాధాకష్ణ సిఫార్సు మేరకు పంపించారు. వైద్యం నిమిత్తం వెళ్లిన ఆమెను అక్కడ వైద్యులు భయపట్టి భుజానికి సర్జరీ చేస్తే ఇబ్బందులు వస్తాయని చెప్పి పంపించేశారని తెలిపారు. కె.లీలావతి అనే మహిళ కిమ్స్ ఆసుపత్రికి పంపితే వారు సైతం తిరిగి వెనక్కి పంపిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులు రోగులను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పుదుచ్చేరి మంత్రులు ఈ సమస్యపై స్పందించాలని కోరారు. దీనిపై యానాం ఆయుష్మాన్‌భారత్ అధికారి పట్టా రామకష్ణను వివరణ కోరగా తాము సిపార్సులు చేస్తున్నా రోగులకు కార్పొరేట్ ఆసుపత్రులు ఆపరేషన్లు నిర్వహించడం లేదని ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని వాపోయారు.

అభయారణ్యాన్ని సందర్శించిన ట్రైనీ అధికారులు



కోరంగి అభయారణ్యాన్ని సందర్శిస్తున్న ట్రైనీ అధికారులు

తాళ్లరేవు: తెలంగాణా రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారులు ఆదివారం కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. స్టడీ టూర్‌లో భాగంగా 43 మంది ట్రైనీలు ఫారెస్ట్‌ను సందర్శించినట్లు ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ తెలిపారు. మడ అడవుల ప్రాముఖ్యత, హోప్ ఐలాండ్ విశిష్టత, ఎకో టూరిజం నిర్వహణ, వివిధ రకాల మొక్కలు, జంతువుల గురించి వివరించినట్లు తెలిపారు. అభయారణ్యంలో సందర్శకుల కోసం ప్రతీనెలా చేపట్టే అంశాలతో పాటు, హోప్ ఐలాండ్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణ గురించి చేపట్టే చర్యలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్‌లు, సీబీఈటీ సిబ్బంది ఉన్నారు.

పవన్‌కు శివశంకర్ సత్కారం



పవన్‌ను సత్కరిస్తున్న శివశంకర్, బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అమలాపురం శ్రీమంత్రప్రగడ వారి సత్రం చైర్మన్ గొర్తి పవన్‌ను తెలంగాణ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ జస్టిస్ బులుసు శివశంకర్ ఘనంగా సత్కరించి అభినందించారు. స్థానిక భూపయ్య అగ్రహారంలో ఆదివారం జరిగిన సత్కారంలో జస్టిస్ శివశంకర్ మాట్లాడుతూ పవన్ చైర్మన్‌గా రాణించి మంత్రిప్రగడ సత్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. అమలాపురానికి చెందిన తాను హైదరాబాద్‌లో ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధిని ఎప్పుడూ కాంక్షిస్తూనే ఉంటానని శివశంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు కొత్తూరి శ్రీను, ఆకెళ్ల నారాయణమూర్తి, కళా వెంకట్రావు, ఏలేశ్వరపు రాధాకృష్ణ, భమిడిపాటి శ్రీరామ్, కొత్తూరి వంశీ, గొర్తి దుర్గి, జిల్లెళ్ల గోపాల్ తదితరులు పవన్‌ను సత్కరించి అభినందించారు.

కాపు విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న కాపు విద్యార్థులతో సంఘం నాయకులు

అమలాపురం రూరల్: కోనసీమ కాపు ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు అందిస్తున్న ఆర్థిక సాయం ప్రశంసనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కోనసీమ కాపు ఉద్యోగ సేవ సమితి ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన 75 మంది కాపు విద్యార్థులకు రూ.5 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. అమలాపురం మండలం సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఉపకార వేతనాలు కాపు సంఘ నాయకులు అందించారు. సంఘం కోనసీమ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కాపు సంఘం నాయకులు ఆకుల రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు పీఆర్‌డీఈఈ అన్యం రాంబాబులు మాట్లాడుతూ కాపు సంఘంలో ఆర్థికంగా ఉండి ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయూతగా ఈ సాయం అందిచడం జరిగిందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని అన్నారు. కాపు సంఘం నేతలు మాట్లాడుతూ ప్రతిభ గల కాపు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న కాపు ఉద్యోగ సేవా సమితి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, సంఘం ప్రధాన కార్యదర్శి పిండి శివ మారుతీప్రసాద్, సంఘం నాయకులు పోతంశెట్టి దొరబాబు, నంద్యాల నాయుడు, వేమన సత్యనారాయణ, నంద్యాల మనువిహార్, వంగా అయ్యప్ప, కోళ్ల స్వామి, లింగోలు పండు, కోనసీమ కాపు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.